ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

# యోగి నారేయణ, పోతులూరి వీరబ్రహ్మంల కాలజ్ఞానాలు తులనాత్మక పరిశీలన

హెచ్. గంగ రాజు
తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాల, పాతూరు, అనంతపురం.

Article Received: 25/02/2025 Article Accepted: 27/03/2025 Published Online: 29/03/2025
DOI:10.53414/Sahithyatharangini.2025.2.1.154

## 1.0 పరిచయం:

భవిష్యత్తులో జరగబోయే విషయాలను తెలిజేసే ప్రజ్ఞ 'కాలజ్ఞానం'. తెలుగు ఆధ్యాత్మిక సాహిత్యంలో 'కాలజ్ఞానం' ఒక ప్రత్యేక విభాగం. సమాజం అధర్మం వైపు వెళ్తున్నప్పుడు, ప్రకృతి వైపరీత్యాలు సంభవించే ముందు ప్రజలను హెచ్చరించి, వారిని ధర్మ మార్గంలో నడిపించడానికి మహనీయులు కాలజ్ఞానాన్ని బోధించారు. తెలుగులో కాలజ్ఞానాన్ని రాసిన కర్తలలో ఆంధ్రదేశానికి చెందిన పోతులూరి వీరబ్రహ్మం, కర్ణాటక-ఆంధ్ర సరిహద్దు ప్రాంత వాసియైన కైవారం నారేయణయోగి ప్రసిద్ధులు.

కాలజ్ఞాన కర్తలు శిష్యసమేతంగా దేశ సంచారం చేస్తూ, తత్త్వాలు, కీర్తనలు, పద్యాల ద్వారా తమ కాలజ్ఞానాన్ని జనానికి అందేలా చేసారు. భవిష్యత్తులో జరుగుబోయే విపత్తులను ప్రజలలో జాగృతం చేయడానికి కాలజ్ఞానాన్ని బోధిస్తూ వివిధ ప్రాంతాలను సందర్శించేవారు. యోగి నారేయణ తమిళనాడు లోని హోసూరు, ఆగ్నేయ కర్నాటక ప్రాంతాలు, ఆంధ్రలోని కదిరి, చిత్తూరు ప్రాంతాలను సందర్శించారు. వీరబ్రహ్మంగారు బాల్యంలో చిక్కబళ్ళాపురం జిల్లాలోను, శైశవ దశలో రాయలసీమలోని కర్నూలు, కడప ప్రాంతాలలో, ప్రౌఢ వయస్సులో విజయవాడ, హైదరాబాదు ప్రాంతాలలో తమ తత్త్వాలను ప్రచారం చేసారు. కాలజ్ఞానాన్ని వినిపించారు. బాల్యంలో బ్రహ్మంగారు నివసించిన చిక్కబళాపురం పట్టణానికి సమీపంలోని పాపాఘ్ని మఠం ఇప్పటికీ ప్రసిద్ధమైన క్షేత్రమే. యోగి నారేయణుల పవిత్ర క్షేత్రమైన కైవారం ఇక్కడికి దగ్గరిలోనే ఉంటుంది.

**ముఖ్య పదజాలం:** యోగి నారేయణ, పోతులూరి వీరబ్రహ్మం, కాలజ్ఞానం, తత్త్వాలు, కులనిర్మూలన, సమకాలీన సామాజిక, రాజకీయ అంశాలు.

## 1.1. పోతులూరి వీరబ్రహ్మం – కాలజ్ఞానం:

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

పుణ్య దంపతులైన పరిపూర్ణయాచార్యులు, ప్రకృతాంబల కుమారుడు వీరంభొట్లయ్య. ఇతనే వీరప్పయాచార్యులు, వీరబ్రహ్మం అనే పేర్లతో ప్రసిద్ధులైన పోతులూరి వీరబ్రహ్మం. 1608-1693 సం.ల మధ్య కాలంలో జీవించారు. చిన్నవయసులోనే తల్లిదండ్రులు కాలధర్మం చెందారు. అనంతరం కర్నాటక, చిక్కబళ్ళాపురం, పాపాఘ్ని మఠంలో కొంతకాలం ఉన్నారు. బాలుడైన వీరంభొట్లయ్యను వీరభోజయాచార్యులు, వీరపాపమాంబలు తల్లిదండ్రులై పోషించారు. చిన్నవయసులోనే కాళికాంబ సప్తశతిని రాసారు. వీరభోజయాచార్యుల కైవల్యానంతరం బ్రహ్మంగారు వీరపాపమాంబకు మానవజన్మ తత్త్వాన్ని బోధించారు. అనంతరం కర్నూలు జిల్లా, బనగానపల్లెకు చేరి అచ్చమాంబ ఇంట పశువుల కాపరిగా కుదిరాడు. అచ్చమాంబకు పరమాత్మను దర్శించే విధాలను వివరించారు. సాంద్రసింధు వేదం అనే పేరుతో ప్రఖ్యాత కాలజ్ఞానాన్ని బోధించారు. వీరకాళికాంబ శతకం, తత్త్వాలను రాసిన యోగి. ఆత్మజ్ఞాన బోధకులు.

**1.2. కైవారం యోగి నారేయణ - కాలజ్ఞానం**

కైవార గ్రామానికి సమీపంలోని కొత్తపల్లెలో ముద్దమ్మ, కొండప్పలకు నారేయణులు జన్మించారు. బాల్యంలో నారాయణప్పగా, అనంతరం యోగి నారేయణగా, నేడు తాతయ్యగా ప్రసిద్ధులు. యోగినారేయణ. 1726 – 1836 సం.ల మధ్య కాలంలో కైవారంలో జీవించారు. పుట్టిననాడే తల్లిని, ఆ వెంటనే తండ్రిని కోల్పోయి కైవార ప్రజల ఇంటి బిడ్డగా పెరిగారు. అందువల్లనే గ్రామంలోని అందరినీ తనవారుగా తాతయ్య భావించారు.

ఫ్రెంచి, డచ్చి, ఆంగ్లేయులు భారతీయులలతో ఒప్పందాలు కుదుర్చుకొని, ఇక్కడి రాజులలో వైషమ్యాలు నింపారు. ఈ దేశం అంతర్గత యుద్ధాలతో, అనిశ్చిత పాలనతో అట్టుడుకుతున్న కాలంలో కన్నడనాట పుట్టిన తెలుగు బిడ్డ నారేయణ. కైవారంలోని అమరనారాయణ స్వామి సన్నిధిలో పెరిగిన వరకవి నారేయణప్ప, ఆత్మ బోధామృతం, తత్త్వాలు, శ్రీకృష్ణ తత్త్వామృత యోగసారం, తారక బ్రహ్మానంద ద్వయకంద శతకం, నాద బ్రహ్మానంద నారేయణకవి శతకాలు రాసారు. కాలజ్ఞానాన్ని బోధించే సూక్ష్మభీమలింగ శతకం, ప్రచండ నారేయణకవి శతకాలు రాసారు.

**1.3. నాటి రాయలసీమ, కర్నాటక సరిహద్దు ప్రాంత రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులు**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

వీరబ్రహ్మం, నారేయణులు 17-18 శతాబ్దాల మధ్య కాలంలో జీవించారు. ఈ కాలంలో దక్షిణ భారతదేశం రాజ్యాధికారం కోసం నిత్యం అంతర్గత యుద్ధాలలో మునిగి ఉండేది. దానివల్ల ప్రజల్లో ప్రాణభీతి ఉండేది. ఏ దైవమైనా తమను రక్షిస్తుందేమో అనే ఆర్తితో బతికారు. యుద్ధాల వల్ల రాజ్యంలో ఆర్థిక సంక్షోభం ఉండేది. భారతదేశాన్ని పాలించిన రాజకుటుంబాలలో మొఘలులది ప్రత్యేక స్థానం. 14వ శతాబ్దం నుంచి 17వ శతాబ్దం వరకు మొఘలులది బలమైన పాలన. ఫ్రెంచ్, డచ్చి దేశీయుల ప్రాబల్యం క్రమంగా తగ్గింది. వారి పతనానంతరం బ్రిటీషువారి ప్రాభవం పెరిగింది. దక్షిణాదిన అళియ రామరాయల అనంతరం విజయనగర సామ్రాజ్యం ముక్కలై, మైసూరు సంస్థానం స్వతంత్రంగా ప్రవర్తించింది. హైదరాలి శ్రీరంగపట్నాన్ని చేజిక్కించుకొని, మైసూరు పాలకులను నామమాత్రం చేసారు. హైదరాలీ, అతని కుమారుడు టిప్పుసుల్తానులకు వలసవాద విస్తరణ ధ్యేయులైన బ్రిటీషువారితో జరిగిన మైసూరు యుద్ధాలలో బ్రిటీషువారు ఆధిపత్యం సాధించారు. 1799వ సం.లో మరాఠా, హైదారాబాదు నిజాముల సహకారంతో బ్రిటీషు సైన్యాలు ఈ విజయాలు సాధించాయి. టిప్పుసుల్తాను వలన పొంచివున్న ముప్పును బ్రిటీషువారు తొలగించినందుకుగాను, నిజాం తన ఏలుబడిలోని కడప, కర్నూలు, చిత్తూరు, అనంతపురం ప్రాంతాలను దత్తంగా ఇచ్చారు. వీటినే సీడెడ్ డిస్ట్రిక్ట్స్ అని, దత్తమండలాలు అని పిలిచారు. దత్తమండలం అనే పదం నచ్చక 1928 నవంబర్ 18న జరిగిన ఆంధ్ర మహాసభలలో కడపకోటిరెడ్డి, చిలుకూరి నారాయణరావుల ప్రతిపాదన మేరకు ఈ ప్రాంతానికి రాయలు ఏలిన సీమగా 'రాయలసీమ' అని నామకరణం చేసారు. నిజానికి ఈ రాయలసీమ పద వ్యుత్పత్తిని విశ్లేషిస్తూ, రాయరాణువ సీమ (రాజులకు అవసరంలో ఉపయోగపడే సైన్యాలు ఉండే ప్రాంతం) అని అంకే శ్రీనివాస్ తన నాడు నుడి అనే పరిశోధనా గ్రంథంలో తెలిపారు.

మైసూరు రాజ్యం 1600 – 1850 సం.ల నడిమి కాలంలో యుద్ధాలతోను, సామంతుల తిరుగుబాట్లతోను సతమతమైంది. సుభిక్షమైన పాలన అందించిన కాలపరిమితులు తక్కువ. రాయలసీమ వర్షచ్ఛాయ ప్రాంతం. విస్తారమైన వర్షాలు కురిసేవి కావు. రాయలసీమగాని, సీమకు సరిహద్దు కర్నాటక గాని సస్యశ్యామలమైనవి కావు. కరువుకాటకాలు కూడ ఈ ప్రాంతాన్ని అస్తవ్యస్తం చేసేవి. చిక్కబళ్ళాపురం జిల్లా నందికొండల్లో పుట్టే పెన్నానది, చిత్రావతి, పాపాగ్ని నదులు వర్షాధారమైనవే తప్ప జీవనదులు కావు. కాబట్టి ఈ ప్రాంతం ఆర్థికంగా సుస్థిరతను సాధించలేదు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

రాజుల పోషణలో మూడు పువ్వులు, ఆరు కాయలుగా విలసిల్లే సంస్కృత భూయిష్టమైన కవిత్వం, నానావిధ వస్తుచయ దీర్ఘ వర్ణనా రచనలు, ప్రబంధాలు మరుగైపోయాయి. పండితీ ప్రకర్షను ప్రదర్శించే సభలు తగ్గాయి. మైసూరు సంస్థానం లాంటివి తప్ప, సామంతుల సాహిత్య పోషణ కరువయింది. అంతోయింతో అక్షర జ్ఞానం ఉన్నవారు అచలతత్త్వంలోకి జారుకున్నారు. కీర్తనలు, వచనాలు చెబుతూ, ప్రజలలో మమేకమయ్యారు.

దేశ క్షేమంకోరిన స్వతంత్ర పాలకులు తగ్గడంతో క్రమంగా ప్రజలలో నిర్వేదం, నిస్సహాయత ఆవరించాయి. ప్రజలలో విద్యాగంధం తక్కువయింది. మూఢనమ్మకాలు పెరిగాయి. ఆర్థికంగా చతికిలబడినారు. కరువు కాటకాలు, యుద్ధభీతితో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని బతికారు. తమను ఆదుకోవడానికి ఏ పరమపురుషుడో, దైవమో రాకపోతుందా అని ప్రజలు అలమటించారు. కులవ్యవస్థ వేళ్ళూనుకుపోయింది. బాల్యవివాహాలు పెరిగాయి. పురుషాధిక్య సమాజంలో స్త్రీలు భయభక్తులతో మెలిగారు. ఇలాంటి దీనస్థితిలోని ప్రజలను ఉద్ధరించడానికి అన్నట్లు వీరబ్రహ్మం, నారేయణలు కంకణ బద్ధులయ్యారు. ప్రజల బతుకుకు అర్థం ఏంటో, బతకడం ఎలాగో తెలియజేసారు. తమ జీవితంలో ఎదురైన సమస్యలు, వాటికి కనుగొన్న పరిష్కారాలను ఆధారం చేసుకొని ప్రజలకు తత్త్వాలుగా చెప్పారు. తపస్సు ఆచరించి, లోక మూల తత్త్వాన్ని తెలుసుకొన్నారు. ఆ తత్త్వ జ్ఞానాన్ని సులభంగా అందరికీ అందడానికి సులభమైన సాహిత్య ప్రక్రియలను ఎన్నుకొన్నారు. మాత్రా ఛందోబద్ధమైన కీర్తనలు, తేటగీతి, ఆటవెలది, కందాల ద్వారా తమ అనుభవాలకు రూపాన్నిచ్చారు. అజ్ఞానంలో మగ్గుతున్న ప్రజలను సుజ్ఞానులను చేయడానికి గానయోగ్యమైన రీతులు ఎంచుకొన్నారు. తాము దర్శించిన భవిష్యత్తుని, కాలజ్ఞాన రూపంలో ప్రజలకు అందించి జాగృతం చేసారు. సామాజిక మార్పును ఆకాంక్షించారు.

## 2. కాలజ్ఞానం

'కాలం పరమాత్ముని విరాట్ స్వరూపం. కాలాత్మకుడే సూర్యుడు. సూర్య భ్రమణమే కాలం పుట్టుక అవుతున్నది. ఒకసారి ధనిష్ట నుంచి ప్రారంభమైన సూర్యుడు శ్రవణా నక్షత్రం చుట్టూ పరిభ్రమించి, తిరిగి ధనిష్టను చేరడానికి ఒక బ్రహ్మ కల్పం పడుతుంది. ఈ బ్రహ్మ కల్ప చక్రంలో మానవుల రోజు లాగే సగభాగం రాత్రి, సగభాగం పగలు ఏర్పడి ఉంది. వెలుతురైనది పగలు, దాని వెనుక భాగం రాత్రి. దీన్ని అనుసరించి బ్రహ్మ కల్పంలో ఒక భాగం సృష్టికల్పం, మిగతా సగం ప్రళయకల్పం. ఇదే మనుషుల అనుభవంలో రోజులో సగభాగం పగలు, సగభాగం రాత్రి. పితృదేవతల కాలంలో సగభాగం శుక్లపక్షం, మిగతాది కృష్ణపక్షం. ఇదే సంవత్సర పురుషుని పన్నెండు మాసాలు.

సంవత్సర పరిభ్రమణంలో ఆరు మాసాలు ఉత్తరాయణం, ఆరు మాసాలు దక్షిణాయనం. సృష్టి ప్రళయాలు, దివారాత్రాలు, పక్షాలు, ఉత్తర దక్షిణ అయనాలు ఈ కాలక్రమంతా యోగి తన శరీరంలో కుండలినీ విద్య ద్వారా దర్శించవచ్చు. ఈ రహస్య విద్యే తారక రాజయోగ విద్య. ఇది తెలియనివారు కాలాజ్ఞానాన్ని తెలుసుకోలేరు.'

తారక రాజయోగం ప్రకారం శరీరమే బ్రహ్మాండం. శిరస్సు ఆలోచనాస్థానమైన బ్రహ్మలోకం. నాభి విష్ణులోకం. హృదయం రుద్రలోకం. వీర్యకణాలే జన్యుదేవతలైన, పితృదేవతలు. మానవజాతి గత తరాలలోని కర్మలని భవిష్యత్ తరాలకి కర్మఫలంగా అనుభవింపచేస్తారు. ఈ గత కర్మలకు ఒక క్రమపద్ధతిలో ఒకదాని తర్వాత ఒకటిగా ఫలితాలని మనకు అందించేది కాలం. ఈ కాలం సంవత్సరాత్మకం. అంటే పన్నెండు నెలలు. సూర్యునికి ఇది ఒక చక్రం. ఇది యోగి శరీరంలో ప్రాణాయామ సమయంలో ఆరు చక్రాల నుండి పైకి ఉద్ధరించినప్పుడు అది ఆరు మాసాల ఉత్తరాయణం. అదే ప్రాణం ఆరు చక్రాలగుండా దక్షిణగతిని పొందితే దక్షిణాయమని అంటారు. కాల స్వరూపుడైన నారాయణుని 'ఓం నమో భగవతే వాసుదేవాయ' అనే మంత్రాన్ని పన్నెండు వేలసార్లు జపిస్తే వీరనారాయణతత్త్వాన్ని దర్శించవచ్చు. రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు చెప్పినట్లు గతంలో జరిగిన సంఘటనలను మళ్ళీ చెప్పడం కాలజ్ఞానం కాదు అని వేదవ్యాసు (1999 కలియుగాంతం కాలజ్ఞానం:1-3) తెలిపారు.

యోగి నారేయణ, వీరబ్రహ్మంగారి కాలజ్ఞానాలు కేవలం భవిష్యత్తును చెప్పడమే కాకుండా సామాజిక అంతరాలు తగ్గాలని, మనిషిని మనిషిగా చూడాలని బోధించాయి. ఆధ్యాత్మిక జీవనం, భక్తి మార్గం, తత్త్వ చింతనలు మనిషిని మహోన్నతునిగా మారుస్తాయని ఇద్దరూ తెలిపారు. వీరు రాసిన 'బ్రహ్మంగారి తత్త్వాలు' తరహాలోనే 'కైవారం తత్త్వాలు' సరళమైన భాషలో సామాన్యులకు అర్థమయ్యేలా నారేయణులు రాసారు. భవిష్యత్తులో చుట్టుముట్టే అన్ని ఆపదలను నివారించుకోవడానికి, భగవన్నామ స్మరణ మేలిమి బాటగా ఇద్దరూ వివరించారు.

### 2.1. ఆరు మతాలు ఏకం కావడం:

'చెప్పలేదంటనక పొయ్యేరు నరులారా...' అంటూ కులమతాల మధ్య అంతరాలు తగ్గిపోవడం, వింత పోకడలు పోవడం గురించి బ్రహ్మంగారు చెప్పారు. ఇది ఒక సామాజిక విప్లవం. 'కులమతాల గోడలు కూలిపోతాయి'

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

అని ఆయన 17వ శతాబ్దంలోనే రాసారు. కులం అంటే శరీరం కాదు, ఆత్మకు కులం లేదు అని నారేయణులు తెలిపారు.

వీరబ్రహ్మం, నారేయణుల ప్రకారం ఆరు మతాలు అంటే హిందూ, బౌద్ధ, జైన, సిక్కు, క్రైస్తవ, ముస్లింలు కావు. బౌద్ధం, చార్వాకం, న్యాయ, వైశేషిక, సాంఖ్య, యోగ మతాలని భావించాలి.

"ఆరు మతములవారు అగడమైపోయిరి

మతమూలమెరిగిన మర్మిలేడెవడు

మతమూలమెరిగితే మహాత్ముడాయరా..." (వేదాంత సారావళి) ఆరుమతాలు కనుమరుగై పోతాయి. మతాల మూల తత్త్వాన్ని ఎరిగిన మర్మిలేడని తాతయ్య తెలిపారు. "ఆరుమతములచిక్కి అలసటపడన్యాల కొండరాళ్ళగోడుగుడువన్యాల" (కాలజ్ఞాన మేలుకొల్పు పు. 31) అని వీరబ్రహ్మం సూచించారు.

**2.2. పరదేశీయుల పాలన అంతరించడం**

వీరబ్రహ్మం కాలం నాటికే ఢిల్లీ సింహాసనాన్ని పరదేశీయులైన మొఘలులు ఆక్రమించారు. యోగి నారేయణుల కాలంలో ఆంగ్లేయులు, డచ్చి, ఫ్రెంచివారి ప్రభావం పెరిగింది. ఫ్రెంచివారిని తాతయ్య పరంగివారని తెలిపారు. యోగి నారేయణుల ప్రకారం అల్పాయుధులైన పరదేశీయులు (ఆంగ్లేయులు) అవనికే దొరలైనారు. వారి దురాక్రమణతో స్వదేశీయులు కష్టాలపాలైనారు. దేశియ ప్రజలకు స్వతంత్ర్యం నశించింది. ఇకపై మ్లేచ్ఛ వానరాల వంటి పరంగీయుల, ఆంగ్లేయుల పాలన అంతరిస్తుందని తాతయ్య తెలిపారు.

అల్పాయుధస్తులు అవనికి దొరలైరి

భూదేవతకు యింతో భారమాయ

మోయలేననుచు మొరబెట్టుచున్నదీ

నిండాపరతత్వ ప్రచండ నారేయణకవి

వానరుల వసుధపాలు తీరెను

ఇకమీద లేదు వచ్చెను అంత్యం ...

ఫలాయనమై పోదురు నిండా పరతత్వ ప్రచండ నారేయణకవి (ప్రచండ నారేయణకవి శతకం-1) అని తెలిపారు. అదే విధంగా వీరబ్రహ్మం మొగలాయి దొరతనం అంతరించిపోతుందని ముందే సూచించారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

"మున్నూరు వారెల్ల ముదుములతో నుండేరు

మొగలాయి దొరతనము లణిగినిమా" (కాలజ్ఞానం మేలుకొల్పు పు. 31. తత్త్వం 14).

**2.3. ప్రకృతిలో కలిగే మార్పులు**

వీరబ్రహ్మం వింత జంతువుల జననం, వింత వ్యాధుల రాక లాంటి ప్రకృతి సిద్ధమైన విషయాలను తన కాలజ్ఞానంలో తెలిపారు. నదులు పొంగిపొర్లుతాయని, విపరీతమైన కరువు కాటకాలు, భూకంపాలు వస్తాయని హెచ్చరించారు. యోగినారేయణులు కూడ ప్రకృతిలో జరిగే విడ్డూరాలను తెలిపారు.

**ఘుములు ఘుముల్లై** తిరుగు ఘూకముల్ నడురాత్రి

వింతవింతలుకూత లిండ్లమీద

కన్నీళ్ళుకార్చు భువి కామధేనువులన్ని

తలవాచుకొని కాళ్ళుతత్తరించు ... (ప్రచండ నారేయణకవి శతకం ప. 9)

గుడ్లగూబల గుంపు అర్ధరాత్రుల్లో ఇండ్లపై వాలి వింతగా కూస్తాయి. అది గమనించి ఆవులు తలలు దించుకొని కన్నీళ్ళు కారుస్తాయి. వాటి కాళ్ళు తత్తరపడతాయని నారేయణులు తెలిపారు.

కడుక్రూరచిత్తులై కలహింతురేవ్యాళ

అన్న తమ్ములు తల్లితండ్రిసుతులు (ప్రచండ నారేయణకవి శతకం ప. 9)

అన్నదమ్ములు, తల్లిదండ్రులు క్రూరచిత్తులై, ఏ వేళ చూసినా గొడవలు పడతారని తెలిపారు. దానివల్ల కుటుంబంలో చిన్నా పెద్దల మధ్య ఆత్మీయతలు దూరమవుతాయి.

.. తల్లూలు బిడ్డాలు తగువులు నడచిని

తల్లడించే దినములొచ్చిని మా

కల్లగాదీమాట యుల్లాము సాక్షిగా ... (కాలజ్ఞానం మేలుకొల్పు పు.34. చ. 40) అంటూ, జరుగబోవు దినాలలో తల్లి, బిడ్డలు తగవులు పడి, తల్లడించే దినాలు వస్తాయని వీరబ్రహ్మం తెలిపారు. సంసారం విచ్ఛిన్నం అయ్యే పరిస్థితులు కలవని సూచించారు. మనుషుల మధ్య మమకారాలు తగ్గుతాయి. కాసులపైన మోహం పెరుగుతుంది. పాలకులు పన్నుల మీద పన్నులువేసి, ప్రజలను దోచుకుంటారని తాతయ్య తెలిపారు.

**పశులమేత భూమిపచ్చెకు కడుగుత్త**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

చెడ్డ స్త్రీలుకు గుత్త చెట్లుగుత్త
ఫలవృక్షములుగుత్త పండ్లుకాయలు గుత్త
భిక్షగాండ్లకు గుత్త బీడు గుత్త
చాకివాండ్లకుగుత్త సారాయి వక గుత్త.
హరిదాసులకుగుత్త అడవిగుత్త
మాలమగ్గముగుత్త మాన్యకాండ్లుకుగుత్త
చాటిమంటికి గుత్త చమురుగుత్త
యన్న టికిలేనిగుత్తలు యాలకలుగు
ప్రజలు జేసిన పాపముల్ ప్రబలమాయ (సూక్ష్మ భీమలింగ శతకం-4)

పశులమేతకు, పచ్చని భూమికి, చెడ్డ స్త్రీలకు, చెట్లకు, ఫల వృక్షాలకు, బిక్షగాళ్ళకు, బీడు భూములకు, చాకలి వారికి, తాగే సారాయికి, హరిదాసులకు, అడవికి, మాల మగ్గాలకు, మాన్యగాళ్ళకు, చాటి మన్నుకు, చమురుకు, అదీ, ఇదని ఏమి అన్ని రకాల గుత్తలు ప్రజలపై పాలకులు విధిస్తారని నారాయణులు తెలిపారు.

**2.4. పునః జననం**

వీరబ్రహ్మం కలియుగం చివరలో అధర్మం పెరిగిపోయినప్పుడు, శ్రీ వీరభోగ వసంత రాయలుగా అవతరించి ధర్మాన్ని రక్షిస్తానని తెలిపారు. యోగి నారేయణులు మాత్రం తాను మళ్ళీ పుట్టనని, ఇదే తనకు ఆఖరి జన్మ అని తెలిపారు.

"పుడమిలోన పుట్టము సద్గురునిలోన ఐక్యమూ ।
కొదవాలన్ని తీరెమాకు యిదే కడజన్మమూ" (వేదాంత సారావళి, కీ. 33, చ. 10)

**2.5. శిష్య పరంపర**

బ్రహ్మంగారు తన జ్ఞానాన్ని తన ముఖ్య శిష్యుడైన సిద్ధయ్యకు మరియు కక్కయ్య వంటి వారికి బోధించారు. ఈ బోధనలు కేవలం భవిష్యవాణి మాత్రమే కాకుండా, మానవుడు ఎలా జీవించాలనే ఆధ్యాత్మిక మార్గాన్ని కూడా చూపిస్తాయి. యోగి నారేయణ ముత్తార్యులకు జ్ఞానమార్గ బోధ చేసారు. ఊరూర తిరిగి, ప్రజలకు తత్త్వబోధ చేసారు. శిష్య, ప్రశిష్యులను పొందారు.

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)

సాహిత్య తరంగిణి

(తెలుగు పరిశోధన పత్రిక)

Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.

A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

**యోగి నారేయణ, వీరబ్రహ్మంల సారూప్య, వైరుధ్యాలు**

భగవంతుని స్వరూపమే మనిషి అని ఇరువురు భావించారు. మనిషికి తత్త్వచింతన, భక్తి భావన, బాధ్యతా యుతమైన జీవనం ప్రధానం తెలిపారు. వీరి ముఖ్య ఉద్దేశం సామాజిక సమతుల్యత, ధర్మ రక్షణ. వ్యక్తిగత నైతికత మరియు భక్తి ప్రచారం. మోక్ష సాధనకు గురువు యొక్క అవశ్యకతను ఇద్దరూ నొక్కి చెప్పారు.

ఆర్తరక్షణ, దుష్టశిక్షణ నిమిత్తం తాను తిరిగి జన్మిస్తానని వీరబ్రహ్మం తెలిపారు. కానీ, యోగి నారేయణులు ఇదే తనకు ఆఖరి జన్మ అని స్పష్టంగా తెలిపారు. మహిమలు ప్రదర్శించడం ద్వారా శిష్యగణాన్ని పెంచుకోవడం, అగ్ర కులాలను ధిక్కరించడం, మనుషులంతా ఒకటే అని చాటడం వీరబ్రహ్మంలో కనిపిస్తుంది. యోగి నారేయణులు తనను ఆశ్రయించిన వారికి మేలు కలగాలనే అభిప్రాయంతోనే మహిమలు ప్రదర్శించారు. అగ్ర వర్ణాలను ప్రత్యక్షంగా ఎదురించలేదు. సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరుకున్నారు. ధర్మానికి కట్టుబడినారు. అవసరమైన మేరకే తర్క చర్చల్లో పాల్గొన్నారు.

వీరబ్రహ్మం కాలజ్ఞానంలో 'రాజకీయ' మరియు 'భౌగోళిక' మార్పుల ప్రస్తావన ఎక్కువ. ఉదా: సూర్యమండలంలో మార్పులు, ప్రకృతి వైపరిత్యాలు, కాశీ పతనం లాంటివి. కైవారం నారేయణ కాలజ్ఞానంలో 'మానసిక' మరియు 'ఆధ్యాత్మిక' మార్పుల ప్రస్తావన ఎక్కువ. భక్తి యోగం ద్వారా మానసాన్ని ఎలా జయించాలో చెప్పారు. ముక్తిసాధనే తాతయ్య బోధనలలోని పరమావధి.

**ముగింపు:** వీరబ్రహ్మంగారు మరియు కైవారం నారేయణ గారు ఇద్దరూ తెలుగు ఆధ్యాత్మిక చరిత్రలో ధ్రువతారలు. వీరిద్దరి కాలజ్ఞానాల సారాంశం ఒక్కటే. 'మనుషులు నీతిగా ఉండాలి, ధర్మాన్ని ఆచరించాలి'. వీరి తత్వాలు కేవలం భవిష్యత్తును చెప్పే జ్యోతిష్యం కాదు, అవి సమాజాన్ని సంస్కరించే దివ్యౌషధాలు. భారతీయ ఆధ్యాత్మిక చరిత్రలో సామాన్యుల భాషలో పరమ సత్యాన్ని బోధించిన మహనీయులు వీరు. వీరిద్దరి తత్వాలు కేవలం భజన కీర్తనలు కావు, అవి మానవ పరిణామ క్రమాన్ని వివరించే విజ్ఞాన శాస్త్రాలు.

**ఆధార గ్రంథాలు**

ISSN:3048-5908 Impact Factor:5.379(SJIF)
సాహిత్య తరంగిణి
(తెలుగు పరిశోధన పత్రిక)
Indexed in: Google Scholar, Academia, Internet Archives etc.
A Peer-Reviewed Telugu Journal; Volume-2, Issue-1, (Jan-Mar), 2025

మహమ్మదు, కాశిం. *కాలజ్ఞాన మేలుకొల్పు*. 1989. వీరబ్రహ్మంగారి కాలజ్ఞానం (మూలం). శిద్దేశ్వర పబ్లికేషన్స్, హైదరాబాద్.

యోగి, నారేయణ. *శ్రీ అమర నారేయణ వేదాంత సారావళి*. బ్రదర్స్ & అసోసియేట్స్, 2008.

యోగి, నారేయణ. *ప్రచండ నారేయణకవి శతకం*. శ్రీ అమర నారేయణ వేదాంత సారావళి (సం.), బ్రదర్స్ & అసోసియేట్స్, 2008.

యోగి, నారేయణ. *సూక్ష్మ భీమలింగ శతకం*. శ్రీ అమర నారేయణ వేదాంత సారావళి (సం.), బ్రదర్స్ & అసోసియేట్స్, 2008.

వేదవ్యాస. *1999 కలియుగాంతం కాలజ్ఞానం*. భారతీ ప్రచురణలు, 1994.

శ్రీనివాస్, అంకే. *నాడు – నుడి*. అనంతపురం, 2024.